సాక్షి పెద్దపల్లి

ఆదివారం | 4 | జూన్ | 2023

న్యూస్‌రీల్

దశాబ్ది ఉత్సవాలు ముగిసేదాకా ప్రజావాణి రద్దు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ముగిసేదాకా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లా అధికారులు ఉత్సవాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఈనెల 5, 12, 19 తేదీల్లో జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన చదువు



బడిబాట ర్యాలీలో పాల్గొన్న డీఈఓ తదితరులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉచితంగా అందుతోందని, పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని డీఈవో మాధవి కోరారు. జిల్లాకేంద్రంలో శనివారం బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం సమకూర్చుతున్నామని వెల్లడించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, ఎంఈఓ సురేందర్‌కుమార్, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు వెంకటేశం, శ్రీలత ఉన్నారు.

ప్రభుత్వ బడిలో చేరండి



సుల్తానాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

సుల్తానాబాద్: విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరాలని కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు ఎంఈవో సురేందర్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్‌లో ఉపాధ్యాయులు పర్యటించి ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. నిపుణులైన టీచర్లు ఉన్నారని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన అందుతోందని వివరించారు.

అవినీతి పాలనను అంతమొందిద్దాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సాగుతున్న అవినీతి పాలనను అంతం చేసేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం మూలసాలలో జరిగిన కార్యక్రమంలో పలువురికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, కనకయ్య, శేరాలు, మల్లయ్య, సదయ్య, రవి, రాజయ్య, వీరమల్లు, సంపత్, సమ్మయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్, అశోక్, ఓదెలు తదితరులున్నారు.

రైతులకేం చేశారని రైతు దినోత్సవం..?



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ రైతులకు ఏం ఒరగబెట్టారని రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తూముల సుభాష్‌రావు, బూతగడ్డ సంపత్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమాన్ ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ హయాంలో రాయితీపై అందించే పథకాలన్నీ అటకెక్కాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు బీమా అందించని ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. బొద్దుపల్లి శ్రీనివాస్, గుర్రాల రాజు, రాజమల్లు, సతీష్ ఉన్నారు.

వాళ్లంతా సామాన్యులు. మధ్యతరగతి కష్టాలను అనుభవించిన వారు. ఆ కష్టాల కడలిని దాటేందుకు ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టారు. కూలీగా మొదలైన వారి ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులు ఉన్నాయి. గది అద్దె చెల్లించలేక ఒకరు దేరాలో నిద్రపోతే.. డబ్బులు సరిపోక ఇంకొకరు కార్లు కడిగారు.. కడుపు మాడ్చుకున్న రోజులూ ఉన్నాయి. అన్నింటిని అధిగమించిన వారిలో అంకితభావం.. ఎదగాలన్న కసి ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. కొందరు కంపెనీలు పెట్టి యజమానులుగా మారితే.. మరికొందరు అదే కంపెనీలో ఉన్నత స్థానాలకు చేరారు. వారి ఎదుగుదలలో ఇతరులకు ఉపాధి చూపిస్తున్నారు. వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తూ.. ఉపాధి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సామాన్యుల సక్సెస్ స్టోరీ ఈవారం సండే స్పెషల్..

దుబాయిలోని ఆఫీస్‌లో రాధారపు సత్యం



సండే స్పెషల్

అసామాన్యులు

- కష్టాల కడలిని దాటిన యువకులు
- ఉపాధి కోసం గల్ఫ్‌బాట
- అంకితభావంతో ఉన్నత స్థానాలకు..
- ఇతరులకు ఉపాధి చూపుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

చదువులో ఫెయిల్.. జీవితంలో పాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువు అబ్బిరాలేదు.. ఆర్థిక పరిస్థితి కలిసి రాలేదు. పదోతరగతి వరకే చదవడమే గగనంగా సాగింది. కష్టాల కడలిని దాటేందుకు చిన్నతనంలోనే స్వగ్రామాన్ని వదిలి ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్‌బాట పట్టాడు. తొలి రోజుల్లో కూలీగా పనిచేసిన రాధారపు సత్యం అంచెలంచెలుగా ఎదిగి నేడు ఒక కంపెనీ యజమానిగా 780 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

2002లో కూలీగా వెళ్లి..

ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలంలోని అడవిపదిరకు చెందిన రాధారపు సత్యం పదోతరగతిలో ఒక్క మార్కుతో ఫెయిలై ఉపాధి కోసం 2002లో దుబాయికి వెళ్లాడు. అక్కడ తొలి ఏడాది సెంట్రింగ్ కూలీగా పనిలో చేరాడు. దేరాల మధ్య నివాసం ఉంటూ కష్టంగా కాలం వెళ్లదీశాడు. ఏడాది అనంతరం ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరాడు. అదే కంపెనీలో మార్కెటింగ్ సేల్స్‌మెన్‌గా, ఆపరేషన్ మేనేజర్‌గా పనిచేశాడు. ఆర్థిక పరిస్థితుల్లో మార్పు రాకపోవడం.. విధుల్లో బాధ్యతలు పెరగడంతో సత్యం ఆలోచనల్లో పడ్డాడు. ఉద్యోగ బాధ్యతలతో అలసిపోయిన ఆయనకు ఓ వినూత్న ఆలోచన వచ్చి.. తానే సొంతంగా కంపెనీ పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలనే నిర్ణయానికి వచ్చాడు. 2015లో సొంతంగా ఎల్‌ఎస్‌పీఎంకే అనే పేరుతో కంపెనీని ప్రారంభించాడు. ఇక్కడ ఉపాధి లేక బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వీసాలను పంపించి తన కంపెనీలో ఉపాధి కల్పించాడు. ప్రస్తుతం సత్యం కంపెనీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన 780 మంది ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా తెలంగాణ దుబాయి ఎమిరేట్స్(ఈటీసీఏ) అధ్యక్షుడిగా ఏడాదిగా పనిచేస్తున్నాడు.

కష్టపడితే ఫలితం ఉంటుంది

> జీవితంలో కుంగిపోకుండా ఒక లక్ష్యంతో కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. ఇందుకు నేనే ఉదాహరణ. చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందులతో బతకడం కష్టమని భావించి.. ఉపాధిని వెతుక్కుంటూ ఎడారి దేశానికి వెళ్లి అక్కడ కూడా దుర్భర జీవితాన్ని గడిపి ఈ స్థాయికి చేరాను. ప్రతి ఒక్కరు కష్టమే ఫలితంగా భావించి ముందుకు సాగాలి.
>
> – రాధారపు సత్యం, ఈటీసీఏ అధ్యక్షుడు



దుబాయిలోని ఆఫీసులో గోపాల్‌రావు

నాడు కూలీ.. నేడు యజమాని

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం దుబాయికి వెళ్లిన వ్యక్తి ఏకంగా ఓ కంపెనీకి యజమాని స్థాయికి ఎదిగాడు. తాను ఎదగడంతోపాటు మరో 130 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బొమ్మెన గోపాల్‌రావు.

2016లో దుబాయి బాట

బొమ్మెన గోపాల్‌రావు గతంలో గ్రామ ఎంపీటీసీగా పనిచేశారు. తర్వాత 2016లో దుబాయిలోని ఓ కంపెనీలో పనిచేసేందుకు వెళ్లాడు. రెండేళ్లు కంపెనీలో పనిచేసిన గోపాల్‌రావు అక్కడి పరిస్థితులను అవగతం చేసుకుని 2018లో క్రియేటివ్ వ్యూ టెక్నికల్ వర్క్స్(ఎల్‌ఎల్‌సీ) అనే కంపెనీని ప్రారంభించాడు. అక్కడి పనులకు, వివిధ కంపెనీలకు కూలీలను చేరవేస్తుంటాడు. అలా ఇప్పటి వరకు ఇండియాలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది యువకులను దుబాయికి తీసుకెళ్లి ఉపాధి చూపుతున్నాడు.



దుబాయి షేక్‌తో వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్

కష్టపడి.. పైకొచ్చారు

వేములవాడ: మూడు దశాబ్దాల క్రితం గల్ఫ్‌బాట పట్టిన యువకుడు.. నేడు ఓ వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఉపాధి వెతుక్కుంటూ వెళ్లిన వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్ నేడు వందలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. 1989లో దుబాయికి ఉపాధి కోసం వెళ్లాడు వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్. తొలి రోజుల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సారార్(శ్రీరాజరాజేశ్వర) పేరుతో బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. దాదాపు 250 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

సొంతూరికి సేవ

ఉపాధి వెతుక్కుంటూ దుబాయి వెళ్లిన తోట రామ్ కుమార్ 30 ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. భార్య స్వప్న, కుమారులు రాహుల్, రోహన్, కూతురు రోష్నిలతో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో వేములవాడకు వస్తుంటారు.

బాధితులకు అండగా..

దుబాయిలో ఇబ్బందులు పడుతున్న మన ప్రాంతం వారికి అండగా నిలుస్తున్నారు. తనకు ఉన్న పరిచయాలతో వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. గల్ఫ్ బాధితులకు అండగా నిలుస్తున్నారు.

లేబర్ టు మేనేజర్‌గా..

- అంచెలంచెలుగా ఎదిగిన నారాయణపూర్ వాసి
- మస్కట్‌లో పలువురికి ఉపాధి కల్పిస్తున్న యువకుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుకుటుంబంలో పుట్టిన ఓ సామాన్య యువకుడు ఉపాధిని వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు వెళ్లి.. నేడు మేనేజర్ స్థాయికి చేరాడు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నాడు. కుగ్రామంలో పుట్టిన ఆ యువకుడు డిగ్రీ వరకు చదివి.. 2006లో స్వగ్రామంలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్‌బాట పట్టాడు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన కొండేటి దేవేందర్ ఒమన్ దేశంలో తొలుత పార్ట్‌టైం ఉద్యోగంలో చేరాడు. వేతనం తక్కువగా ఉండడంతో కార్లు సైతం కడుగుతూ కాలం వెల్లదీశాడు. మురియా టూరిజం డెవలప్‌మెంట్ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా చేరాడు. దేవేందర్ అంకితభావంతో పనిచేస్తున్న విధానాన్ని గుర్తించిన యాజమాన్యం అడ్మిన్ అసిస్టెంట్‌గా అవకాశం ఇచ్చింది. క్రమంగా రెంటల్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. తన ఎదుగుదలతోపాటు సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన అనేక మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాడు. అక్కడికి వెళ్లిన వారికి మంచి ఉద్యోగాలను దగ్గర ఉండి వెతికి పెట్టాడు. దేవేందర్ సహకారంతో సుమారు యాభైకి పైగా ఒమన్ దేశంలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా ఇండియాలో సాఫ్ట్‌వేర్ల కంటే ఎక్కువ వేతనాలు పొందుతూ సంతోషంగా ఉన్నారు.



ఆఫీసులో దేవేందర్

అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి

> ఉద్యోగాలు లేవని.. నిరాశ పడకుండా మంచి నైపుణ్యంతో ఒమన్ లాంటి దేశాలకు వస్తే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నైపుణ్యం ఉన్న వారికి గౌరవప్రదమైన ఉద్యోగమే కాకుండా మంచి వేతనాలు ఉంటాయి. గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా టూరిజం, హోటల్ రంగాల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఆత్మస్థైర్యంతో ఉండి, ఈ దేశానికి వస్తే ఏదైనా సాధించే అవకాశం ఉంది.
>
> – కొండేటి దేవేందర్, ఎన్‌ఆర్‌ఐ, ఒమన్

ఆధునిక టెక్నాలజీతో నేరాల అదుపు

- నేడు సురక్ష దివస్
- జిల్లాలో ఓపెన్‌హౌజ్‌లు
- నేరాల నియంత్రణకు కఠిన చర్యలు
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



కవాతు చేస్తున్న పోలీసులు

గోదావరిఖని: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం.. కొత్తగా పోలీస్ వాహనాలు వెరసి రామగుండం కమిషనరేట్‌లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సురక్ష దివస్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని మూడు చోట్ల ఓపెన్‌హౌజ్‌లు ఏర్పాటు చేశారు. 2016 అక్టోబర్ 11న పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలను కలుపుతూ రామగుండంలో పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించారు. రామగుండంలో ఆధునిక భవనాలను నిర్మించారు. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ఫింగర్ ప్రింట్ ల్యాబ్, వీడియో ఎనహాన్స్‌మెంట్, సీడీఆర్ ఏర్పాటు చేశారు. ఇవి పరిశోధన, పరిష్కారం, కేసుల ఛేదనకు ఉపయోగపడుతున్నాయి.

బ్లూకోల్ట్స్ పోలీసింగ్

బ్లూకోల్ట్స్ ద్వారా ప్రజలకు సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో 17 బ్లూకోల్ట్స్ ద్వారా 59 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. నేర నియంత్రణ, శాంతి భద్రతలను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దిష్ట సమయంలోనే సంఘటన స్థలానికి చేరుకుని ప్రజలకు రక్షణగా నిలుస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

నేరాల నియంత్రణకు జిల్లాలో 4,310 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే మహిళలపై దాడులను నిరోధించేందుకు షీటీమ్స్ కీలకంగా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 942కార్యక్రమాలు నిర్వహించి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. జిల్లాలో 8,96,125 ఈ చాలాన్ల ద్వారా కేసులు నమోదు చేసి రూ.31,24,84,605 జరిమానా విధించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నవారిపై 71 కేసులు నమోదు చేసి 190 మందిని అరెస్ట్ చేశారు. 394 కిలోల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

పోలీస్ కళాబృందాల ద్వారా మారుమూల ప్రాంతాల్లో బాల్య వివాహాలు, షీ టీమ్స్, సైబర్‌నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, రోడ్డు భద్రత ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. ఇలా 185 అవగాహన సదస్సులో నిర్వహించారు.

పీడీయాక్ట్..

తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీయాక్ట్ అమలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 86 మందిపై ఈ చట్టాన్ని అమలు చేశారు. ఆపరేషన్ స్మైల్ ద్వారా 902 మంది పిల్లలను రక్షించారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ద్వారా 30,242 మంది దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు నివేదించారు. జాబ్ వెరిఫికేషన్ దరఖాస్తులు 11,963 పరిశీలించి 6,939 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు.

నేడు పోలీసు శాఖ సురక్ష దినం

పెద్దపల్లిరూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసుశాఖ సురక్ష దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత, డీసీపీ వైభవ్‌గైక్వాడ్ తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి ప్రభుత్వ ఐటీఐ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు పెద్దపల్లి, గోదావరిఖని, మంథని పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ ఉంటుందన్నారు.

రాజీలేకుండా ముందుకు..



> శాంతిభద్రతల రక్షణలో రాజీలేకుండా ముందుకు సాగుతున్నాం. టెక్నాలజీ సాయంతో నేరాల అదుపునకు కృషి చేస్తున్నాం. కమిషనరేట్ ఆధునిక భవనం ప్రారంభంతో అన్ని విభాగాలు ఒకేచోట ఉన్నాయి. నేరాలకు తగినట్లు పోలీసులకు శిక్షణ ఇస్తున్నాం. సైబర్‌క్రైంపై అప్రమత్తంగా ఉన్నాం. సరిహద్దు ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేస్తున్నాం. – రెమా రాజేశ్వరి, సీపీ

రైతులకు అండగా ప్రభుత్వం

- జిల్లా వ్యాప్తంగా రైతు దినోత్సవం
- ధూళికట్టలో పాల్గొన్న కలెక్టర్ సంగీత



ఎలిగేడులో నిర్వహించిన రైతు దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ సంగీత, మహిళా రైతులు

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని కలెక్టర్ సంగీత అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో శనివారం ఎలిగేడు మండలం ధూళికట్ట క్లస్టర్ పరిధిలో నిర్వహించిన రైతు దినోత్సవంలో పాల్గొన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడేందుకు పంట కాలాన్ని నెలముందుగా ప్రారంభించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను 10రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగరాల సావిత్రి, మహిళలు బోనాలు, బతుకమ్మతో రైతు వేదికకు తరలివచ్చారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వల, సుద్దాల, గర్రెపల్లి, అల్లీపూర్, కనుకుల, కాట్నపల్లిల్లో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ సంగీత చిన్నకల్వలలో పాల్గొన్నారు.

రైతును ఆదుకుంటున్నాం: ఎమ్మెల్యే దాసరి

రైతును బాగు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దాలలో నిర్వహించిన రైతు దినోత్సంలో పాల్గొన్నారు. రైతుబీమా, రైతుబంధు, 24గంటల ఉచిత కరెంట్, ఎరువులు, విత్తనాల పంపిణీ అమలు చేస్తున్నామన్నారు. ఎంపీపీ బాలాజీరావు, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ యాకన్న, వీరగోని సుజాత పాల్గొన్నారు.

పండుగలా వ్యవసాయం

పెద్దపల్లిరూరల్: తెలంగాణలో వ్యవసాయం పండుగలా సాగుతోందని ఎమ్మెల్యే దాసరి అన్నారు. పెద్దపల్లి మండల చీకురాయిలో జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్‌తో కలిసి పాల్గొన్నారు. సర్పంచ్ బండారి త్రివేణి, నాయకులు రాజేశం తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రైతులకు కొండంత అండ

కమాన్‌పూర్: తెలంగాణ వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొండంతా అండగా నిలిచిందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గుండారం, నాగారం రైతు వేదికల్లో మాట్లాడారు. ముందుగా రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడ్డాక రైతులకు కరెంట్ సమస్య తీరిందన్నారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ముత్తారంలో ర్యాలీ..

మంథని: ఉత్సవాల్లో భాగంగా ముత్తారం నుంచి ఓడేడు వరకు ర్యాలీ నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మధు సూచించారు. బీఆర్‌ఎస్ ముత్తారం మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత ఉన్నారు.

ఎడ్లబండ్లతో ర్యాలీ



రామగుండం: ఎడ్లబండ్ల ర్యాలీలో ఎమ్మెల్యే చందర్

రామగుండం: రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బ్రాహ్మణపల్లి, సోమనపల్లి రైతుభవన్‌లో సంబరాలు నిర్వహించారు. వివిధ గ్రామాల రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీగా తరలివచ్చారు. వారికి అంగన్‌వాడీ, ఆశవర్కర్లు కోలాటాల ప్రదర్శనతో స్వాగతం పలికారు. ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి

పాలకుర్తి: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. దశాబ్ది ప్రగతియాత్రను శనివారం పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లిలో నిర్వహించారు. ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. శ్రీకోదండ రామాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తనను ఆదరించి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి శ్రమిస్తున్నానని అన్నారు. రామగుండంకు మెడికల్ కళాశాల తీసుకొచ్చామని తెలిపారు. సబ్ రిజిస్టార్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.50లక్షలతో తిలక్‌నగర్ కూడలి సుందరీకరణ



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని తిలక్‌నగర్ కూడలి సుందరీకరణ పనులను శనివారం నగర మేయర్ అనిల్‌కుమార్‌తో కలిసి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. రూ.50లక్షలతో కూడలిని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, ఎండీ.ముస్తాఫా, కొమ్ము వేణుగోపాల్, అడ్డాల గట్టయ్య, నాయకులు జేవీ రాజు, పర్లపల్లి రవి, ధరణి జలపతి, మైస రవి, కోడి రామకృష్ణ, సత్యం, లక్ష్మీనారాయణ, కిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

జ్యోతినగర్: అదనపు కట్నం కావాలని వేధిస్తున్న ఓ మహిళ భర్తతోపాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎన్టీపీసీ పోలీస్‌లు తెలిపారు. స్థానిక మాతంగికాలనికి చెందిన ఆఫ్రీన్‌కు సాధిక్ పాషాతో 2019లో వివాహమైంది. కొద్దిరోజులుగా ఆఫ్రీన్‌ను అదనపు కట్నం కోసం భర్త, అత్తామామతో మరో ఇద్దరు వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జ్యోతినగర్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి పంపించినట్లు పోలీసులు తెలిపారు. శనివారం వేకువజామున ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్గాం మండలం గోదావరి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు 100 నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని రెండు ట్రాక్టర్లను పట్టుకుని రామగుండం తహసీల్దార్ కార్యాలయానికి పంపించారు. ఇందులో ఓ ట్రాక్టర్‌కు నంబర్ ప్లేట్ కూడా లేదని సమాచారం.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి చైతన్యపురికాలనీకి చెందిన జంగపల్లి కనుకయ్య (45) కుటుంబకలహాలతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కనుకయ్య భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వినయ్ ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బీటెక్ రెండో సంవత్సరం, చిన్న కుమారుడు శివ ఇంటర్ చదువుతున్నారు. కనుకయ్య తాగుడుకు బానిసయ్యాడు. రోజు తాగితే కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఎలా అని భార్య మందలిస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన కనుకయ్య భార్య సరిత పనికి వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. భార్య వచ్చేసరికే చనిపోయి కనిపించాడు. సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్‌నెస్ తప్పనిసరి



భీంసింగ్, ఎంవీఐ, రామగుండం



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ భీంసింగ్ (ఫైల్)

- లేకపోతే పాఠశాల బస్సులు సీజ్
- వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తాం..
- రామగుండం ఎంవీఐ భీంసింగ్

జ్యోతినగర్(రామగుండం): వేసవి సెలవులు ముగుస్తున్నాయి. మరో వారం, పదిరోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. విద్యార్థులను పాఠశాలలకు తరలించేందుకు వాహనాలు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఆయా యాజమాన్యాలు వినియోగించే వాహనాలు ఫిట్‌గా ఉన్నాయా..? పిల్లలు ఆయా వాహనాల్లో ప్రయాణించొచ్చా? అసలు బడిబస్సు భద్రమేనా? పాఠశాల యాజమాన్యాలు స్కూల్ బస్సుల నిర్వహణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తదితర అంశాలను రామగుండం ఎంవీఐ భీంసింగ్ వివరించారు.

ఇవీ నిబంధనలు..

- విద్యా సంస్థల బస్సుకు ఎడమవైపు ముందు భాగంలో పాఠశాల పేరు, ఫోన్‌నంబర్ సహా పూర్తి చిరునామా స్పష్టంగా రాయాలి. బస్సును ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ నెలకోసారి పరీక్షించాలి. కండీషన్ పనితీరు తెలుసుకోవాలి. ఫిర్యాదుల కోసం పుస్తకాన్ని అందుబాటులో ఉంచుకోవాలి.
- ఏ విద్యా సంస్థ బస్సు కూడా పరిమిత సీట్ల కన్నా ఎక్కువ మందిని తీసుకెళ్లరాదు. ప్రతి వాహనానికి అత్యవసర ద్వారం, బాహ్య పరికరాలు, లైటింగ్, విండ్ స్క్రీన్, వైపర్ తదితర వాటిని కల్పించాలి. ప్రతి బస్సులో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి.
- పాఠశాల ఆవరణలో ఈ బస్సులు, వ్యాన్లకు యాజమాన్యమే స్థలం కేటాయించాలి. అక్కడే విద్యార్థులు తమ ప్రాంతానికి వచ్చే బస్సులు ఎక్కడం, దిగడం చేయాలి. ప్రతి బస్సులో అటెండర్ తప్పనిసరిగా ఉండాలి.
- విద్యాసంస్థల బస్సుల డ్రైవర్‌కు 60 ఏళ్లు నిండి ఉండవద్దు. డ్రైవర్ ఆరోగ్య పట్టికను బస్సుల్లో సూచించాలి. అతనికి ప్రతీ మూడు నెలలకోసారి బీపీ, షుగర్, కంటిచూపు వంటి పరీక్షలు యాజమాన్యం నిర్వహించాలి.
- డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వ్యక్తినే డ్రైవర్‌గా నియమించాలి.ఐదేళ్ల బస్సు నడిపిన అనుభవం ఉండాలి. సీట్ల అరల కింద బ్యాగులు పెట్టేలా సౌకర్యాన్ని కల్పించాలి. వాహనాలకు నాలుగు వైపులా లైట్లు అమర్చాలి. బస్సులో నుంచి విద్యార్థులు ఎక్కి, దిగేటపుడు ఈ లైట్లు వెలిగించాల్సి ఉంటుంది.
- ముందు భాగంలో 250ఎంఎంలకు తగ్గని ఎత్తులో పాఠశాల విద్యార్థి, విద్యార్థిని చిత్రాలను నలుపు రంగులో చిత్రీకరించాలి. ఆ చిత్రం కింద స్కూల్ బస్సులేదా కళాశాల బస్సు అని నలుపు రంగులో 100ఎంఎం సైజులో అక్షరాలు రాయించాలి. విద్యార్థులు సులువుగా బస్సు ఎక్కేందుకు మెట్లు పెట్టాలి. బస్సుల తలుపులు సురక్షితంగా లాకింగ్ పద్ధతిలో ఉండాలి.
- ప్రతీ స్కూల్‌బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ఉండాలి. ప్రతీ పాఠశాల బస్సు పూర్తి ధ్రువీకరణ పత్రాలు పొందిన తరువాతే విద్యార్థులను తీసుకెళ్లాలి. బస్సులకు లేత పసుపురంగు వేయడం వల్ల తేలికగా గుర్తుపట్టేందుకు వీలు కలుగుతుంది.
- రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 27వరకు బస్సులు ఉన్నాయి. ప్రస్తుతం 5 బస్సులను పరీక్షించాం. మిగతా బస్సుల యజమానులు త్వరగా ఫిట్‌నెస్ పొందాలి. పాఠశాలలు ప్రారంభం కాగానే వాహన తనిఖీలు ముమ్మరం చేస్తాం.
- విద్యార్థులను తీసుకెళ్లే టాటాఏసీ, ఆటోల్లో ఓవర్‌లోడును గుర్తిస్తే జరిమానాలు తప్పవు. ఇటీవల స్కూల్ బస్సును వివాహ కార్యక్రమానికి ఉపయోగించినందుకు రూ.1,50,000 వేల వరకు జరిమానా విధించాం.

జపాన్ ఇన్‌స్పైర్ మనక్‌కు మనోళ్లు



శ్రీహితరెడ్డి



అభిషేక్



శ్రీజ



పూజశ్రీ

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఆరు ప్రదర్శనలు ఎంపిక

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇన్‌స్పైర్ మనక్ అవార్డు ప్రదర్శనలో భాగంగా 2017–18, 2018–19, 2019–20, 2020–21 విద్యాసంవత్సరాలకు గానూ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల ప్రాజెక్టులను జపాన్‌లోని సకూరా సైన్స్ హైస్కూల్‌లో జరిగే ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శనకు ఎస్‌సీఈఆర్‌టీ ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి 18 ప్రదర్శనలు ఎంపిక కాగా.. ఉమ్మడి జిల్లానుంచి ఆరు ప్రదర్శనలు ఎంపిక కావడం విశేషం. పెద్దపల్లి జిల్లా నుంచి మూడు, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి ఒక్కో ప్రదర్శన ఎంపికైంది. కాగా 2017–18, 2018–19 సంవత్సరాలకు గానూ 7వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన ఢిల్లీలో 2019 ఫిబ్రవరిలో జరిగింది. 2019–20 సంవత్సరానికి గాను 8వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన కరోనా వైరస్ నేపథ్యంలో ఆన్‌లైన్ వేదికగా 2021 సెప్టెంబర్‌లో జరిగింది. 2020–21 ఏడాదికిగానూ 9వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన ఢిల్లీలో 2022సెప్టెంబర్‌లో జరిగింది. ఈ నాలుగేళ్లలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల ప్రదర్శనలను జపాన్ ఇన్‌స్పైర్ మానక్‌లో ప్రదర్శించనున్నారు. కాగా కె.శ్రీజ, ఎం.పూజశ్రీ, డి.హర్షిత (పెద్దపల్లి), వి.శ్రీహితరెడ్డి (కరీంనగర్), ఎండీ.జాకీఅహ్మద్ (జగిత్యాల), ఎం.అభిషేక్ (రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. జపాన్‌లోని సకూరాలో నవంబర్ 5 నుంచి 11 వరకు పోటీల ప్రదర్శన జరగనుంది.



హర్షిత

చెట్టును ఢీకొట్టిన లారీ



పెద్దకల్వల వద్ద చెట్టును ఢీకొట్టిన లారీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల స్టేజీ సమీపంలో శనివారం వేకువజామున కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ రోడ్డుపై మరమ్మతుల కారణంగా నిలిచిన వ్యాన్‌ను ఢీకొట్టింది. అదుపుతప్పి సమీపంలో ఉన్న తాటిచెట్టునూ ఢీకొంది. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్, ఏఎస్సై రామస్వామి తమ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని లారీ డ్రైవర్, క్లీనర్ కోసం వెదికారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి ఉండొచ్చని అరగంటపాటు శ్రమించి తలుపులు పగులకొట్టారు. అందులో ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, క్లీనర్ పారిపోయినట్లు సమాచారం. లారీ నంబరు ఆధారంగా యజమానిని గుర్తించి సమాచారం అందించామని పోలీసులు తెలిపారు. మరమ్మతు కారణంగా రోడ్డుపై నిలిపిన వ్యాన్‌ను గమనించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు.

బొగ్గుబాయి వార్తలు

వేడుకలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎంలు మనోహర్, వెంకటేశ్వర్లు

- ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు మనోహర్, వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(మంథని): రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా సింగరేణి సంబురాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు మనోహర్, వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు జీఎం కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ, రాణి రుద్రమదేవి క్రీడా మైదానం వరకు ప్రగతి పరుగు, అమరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఉంటుందని పేర్కొన్నారు. వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అతిథుల ప్రసంగాల అనంతరం భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు శ్రీనివాసులు, బైద్య, రఘుపతి, రాధాకృష్ణ, నరేందర్, నాగేశ్వర్‌రావు, వెంకట రమణ, జైనుల్ల బద్దిన్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, చంద్రశేఖర్, నాగరాజు, ఐలయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమష్టి పోరాటంతోనే వేతన ఒప్పందం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సమష్టిపోరాటంతోనే 19శాతం పెరుగుదలతో మెరుగైన వేతన ఒప్పందం కుదిరిందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జీడీకే–2ఏ గనిపై గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఐఎన్‌టీయూసీ వేజ్ బోర్డులో సభ్యత్వం సాధించిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీడీపీఈ గైడ్‌లైన్స్‌ను అడ్డం పెట్టుకుని కార్మికుల వేతనాలు పెరగకుండా ప్రయత్నాలు చేసినప్పటికీ అడ్డుకున్నామన్నారు. బకాయిలు పేరుకపోవడంతో 10వేల క్వార్టర్ల నిర్మాణం, కొత్తగనుల ఏర్పాటు, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పనులు నిలిచిపోయాయన్నారు. సీనియారిటీ ప్రతిపాదికన నాలుగేళ్ల నుండి ఆర్జీ–1 ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 190/240 మస్టర్లు నిండిన వారికి వెంటనే జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మపతిగౌడ్, ధర్మపురి, క్రిష్ణ, పోషం, రాజయ్య, సాగర్, జగన్మోహన్, అల్లావుద్దీన్, ఆంజనేయులు, మహేష్‌బాబు, రాజేశం పాల్గొన్నారు.

వాస్తవ లాభాలపై శ్వేతపత్రం విడదల చేయాలి

- బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: 2022–23 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–5 ఓసీపీపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఆదాయపన్ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా భూగర్భ గనుల్లోకి వెళ్లి జాతీయ సంపదను వెలికితీస్తున్న కార్మికులకు ఆదాయపన్ను రద్దు చేయాలన్నారు. ప్రతిఏటా పన్నుల రూపేనా రూ.వేల కోట్లు సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని తెలిపారు. 11వ వేజ్ బోర్డు ద్వారా మెరుగైన వేతనాలు, అలవెన్సులు సాధించడం చరిత్రాత్మకమైన ఒప్పందమన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఆకుల హరీష్, పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, నీలం శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, నీలం శ్రీనివాస్, మాదాసి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చి మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదింపాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జీడీకే–1వ గని వద్ద నర్సరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. సింగరేణిలో పర్మినెంట్ కార్మికులు తగ్గి కాంట్రాక్టు కార్మికులు పెరిగిపోతున్నారని, వారికి కోలిండియా మాదిరిగా హైపర్‌కమిటీ వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4న కొత్తగూడెం హెడ్డాఫీస్ ముందు జరిగే ఆందోళనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ.గౌస్, శనగల శ్రీనివాస్, పద్మ, వెంకటమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను ముందే గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని: గనుల్లోని పనిస్థలాల్లో ప్రమాదాలను ముందే గుర్తించి అప్రమత్తంగా ఉండాలని వకీల్‌పల్లిగని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం గనిపై ఏర్పాటు చేసిన రక్షణ అవగాహన సమావేశంలో మాట్లాడారు. పనిస్థలాల్లో ఉన్న అధికారులు, సూపర్‌వైజర్లు ప్రమాదాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గని మేనేజర్ కిరణ్‌కుమార్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీవైఎస్ఎస్ఓ అఫ్సర్‌పాషా, అడిషనల్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ రక్షణపై లేదు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్



కార్మికుడిని పరామర్శిస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: సింగరేణి సంస్థకు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. వకీల్‌పల్లిగని ప్రమాదంలో గాయపడి స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు నవీన్‌ను శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పెండ్యాల మహేశ్, మాటూరి సత్యప్రసాద్ ఉన్నారు.

ముగిసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్



క్రీడాకారులకు జెర్సీలు అందిస్తున్న ఎస్‌వోటూ జీఎం

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధి సెంటనరీకాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా మైదానంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంపు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎస్‌వోటూ జీఎం రఘుపతి, డీజీఎం విలాస్ శ్రీనివాస్ పొద్దార్ హాజరై కోచింగ్ తీసుకున్న క్రీడాకారులకు జెర్సీలను అందించారు. చిన్నతనం నుంచి క్రీడలో ప్రతిభను వెలుగులోకి తెచ్చుకునేందుకు కోచింగ్ మంచి అవకాశమని అన్నారు. కార్యక్రమంలో దేవ శ్రీనివాస్, భూస వెంకటేశ్వర్లు, కోచ్‌లు ముఖేష్‌కుమార్, లవకుష్, రవి, శ్రీజా, అగ్గి నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

- మార్పులు, చేర్పులకు అవకాశం
- ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు



దరఖాస్తుల స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

సుల్తానాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల చేసింది. అక్టోబరు ఒకటో తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించనున్నారు. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుంది. ఇప్పటికే సాంకేతిక సహాయంతో బోగస్ ఓట్ల ఏరివేత ప్రక్రియ సాగుతోంది. ఆధార్ అనుసంధానం సైతం శరవేగంగా చేపడుతున్నారు. ఒకే ఇంటి నంబర్‌తో పదుల సంఖ్యలో ఉన్న ఓట్లను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి వడబోత చేస్తున్నారు. వాస్తవంగా ఓటర్లు ఉన్నారా..? తప్పుడుగా నమోదయ్యారా..? కోణంలో పరిశీలిస్తున్నారు. మరోవైపు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ సమ్మరి రివిజన్–ఎస్ఎస్ఆర్–2023) పేరిట షెడ్యూల్ ప్రకటించారు. నూతన షెడ్యూల్ ఈనెల 25న ప్రారంభం కాగా అక్టోబర్ 4న తుది ముసాయిదా విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలో 6,68,856 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,35,075 పురుషులు, 3,33,742 మహిళలు, 39 ఇతరులుగా నమోదయ్యారు. ఒకే ఇంటిలో ఆరు ఓట్ల కంటే ఎక్కువ ఉన్న ఓటర్లను ఎన్నికల సంఘం గుర్తించింది. ఆయా జాబితాను జిల్లాలకు పంపించింది. ఒకే ఇంటి నంబర్‌తో జిల్లాలో 10,249 గృహాల్లో 88,687 మంది ఓటర్లు ఉన్నారు.

ఈనెల 23 వరకు సర్వే

పారదర్శక ఓటరు జాబితా కోసం అధికారులు ఇంటింటికీ వెళ్తున్నారు. బోగస్ ఓట్లను తొలగిస్తూ.. కొత్త ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 23 వరకు దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఓటరు జాబితాలో మార్పులకు అనుగుణంగా ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1000–1500 ఓటర్లు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. సెప్టెంబర్ 22లోపు అభ్యంతరాలను పరిశీలించి జాబితా కొలిక్కి తీసుకొస్తారు. అక్టోబర్ 4న తుదిజాబితా ప్రచురించనున్నారు. మండల స్థాయిలో తహసీల్దారు, డివిజన్‌లో ఆర్డీవోలు పర్యవేక్షిస్తున్నారు. తప్పులు లేకుండా జాబితా ఉండేలా ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు.


ముసాయిదా జాబితా తయారీకి ముందు

జూన్ 23 వరకు: బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలిస్తారు. జూన్ 24 నుంచి జులై 24 వరకు పోలింగ్ కేంద్రాలు, లొకేషన్ మార్పులు, సవరణలు, పోలింగ్ కేంద్రాల పరిధి, హద్దులు, ప్రతిపాదనలు, ఖరారు. జులై 25 నుంచి 31 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారు

విడుదల తర్వాత..

ఆగస్టు 2వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, ఆగస్టు 2 నుంచి 31వ తేదీ వరకు ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణకు దరఖాస్తుల స్వీకరణ, సెప్టెంబరు 22 వరకు దరఖాస్తుల పరిష్కారం, అక్టోబర్ 4 ఫైనల్ ఓటర్ల జాబితా ప్రకటన.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశాన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ వినియోగించుకోవాలి. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఇంటి వద్దకు వచ్చే బీఎల్‌వోలకు 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు, ఫొటోలు ఇవ్వాలి. సవరణలు సైతం చేసే అవకాశం ఉన్నందున అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – సంగీత, కలెక్టర్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ డిస్కంటిన్యూ చేశారా! మళ్ళీ మళ్ళీ ఫెయిల్ అవుతున్నారా?? అయితే మా వద్ద 100% పాస్ అయ్యి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి. డైరెక్ట్ SSC, Inter, One Sitting, Any Degree, PG, BBA, పాలిటెక్నిక్, D.Pharma, Oct. Exams Last Date: 07/06/2023. Hyd. Call:8309624934 [HA-14650]

SERVICES

పాస్‌పోర్టు పోయినది

■ మార్క శ్రీనివాస్ S/o బాల మల్లయ్య, H.No. 3-55, R/o బండలింగంపల్లి, మం॥ ఎల్లారెడ్డిపేట, జి॥ రాజన్న సిరిసిల్ల, Pin: 505303, T.S, చెందిన నా యొక్క పాసుపోర్టు నెం. F9091626, Issue Date: 14-07-2006 గలది మా ఇంటి నుండి ముస్తాబాద్‌లోని మీ సేవ ఆఫీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో పోయినది కావున ఇట్టి పాస్‌పోర్టు ఎవరికైన దొరికినచో పై అడ్రస్‌లో సంప్రదించి ఇవ్వగలరు. [K-1217152]

డిస్ట్రిబ్యూటర్స్ కావలెను

■ ప్రముఖ కూల్ డ్రింక్స్ కంపెనీ ప్రోడక్ట్స్ 7up, Sting, Mountain Dew మొ॥ వాటికి డిస్ట్రిబ్యూషన్ చేయుటకు కరీంనగర్ జిల్లాలో మండలాల వారిగా డిస్ట్రిబ్యూటర్లు కావలెను. సంప్ర॥ 8919645134, 9866869909 [K-1219837]

CHANGE OF NAME

■ I PODAPATHRAM RAJU S/o SHANKARAIAH (Old Name) H.No. 5-49/2, Reddypalle, Veenavanka Mandal, Dist: Karimnagar Have Changed my Name as PODAPATRAPU RAJU S/o SHANKARAIAH (New Name) [K-1217153]

WANTED

■ Wanted experienced car Driver with licence for house purpose and one office cleaning boy. Only KNR local persons. Cont: Cell: 6303961198, 9491151939 [K-1219836]

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

■ వేములవాడలో కొత్త స్కూలుకు స్వీపర్లు, ఆయాలు, అటెండర్, DTP ఆపరేటర్ కావలెను. పిల్లలకు ఉచిత స్కూల్ విద్య, వసతి సంప్ర॥ 9246932088, 7995410190 [K-1219834]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786393]

■ శతాబ్ది ఆర్గానిక్ ప్రొడక్ట్‌కు డిస్ట్రిబ్యూట్ చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలర్స్ కావలెను. వివరాలకు ఫోన్: 9966189898 [H-778997]

FACULTY TEACHERS

■ English Teachers' Training to get Trained, Certified & Get Highly Paid Jobs in TOP 500 Edu. Inst. Cont.: Ph : 9248481331 [HA-14648]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221311]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.